క్లుప్తంగా

రేపు కారంచేడు-1 సచివాలయం ప్రారంభం

కారంచేడు: మండల కేంద్రమైన కారంచేడు-1 గ్రామ సచివాలయ నూతన భవనాన్ని ఆదివారం ప్రారంభిస్తారని స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్, ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు యార్లగడ్డ రజనీశ్రీనివాసరావులు హాజరవుతారన్నారు. మండలస్థాయి నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, అధికారులు తప్పకుండా హాజరు కావాలని పార్టీ కార్యాలయం ప్రకటనలో తెలిపింది.

14న హనుమజ్జయంతి వేడుకలు

చీరాల అర్బన్: పట్టణంలోని పేరాలలో వేంచేసియున్న భద్రావతి సమేత భావనాఋషి దేవస్థాన ప్రాంగణంలో గల అభయాంజనేయ స్వామి జయంతి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటి అధ్యక్ష, కార్యదర్శులు కే దేవేంద్రనాథం, జీ వెంకట సుబ్బారావులు శుక్రవారం తెలిపారు. ఉదయం స్వామివారికి క్షీరాభిషేకం, పూజ, సాయంత్రం భజనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని వారు కోరారు.

రేపు వీరాంజనేయస్వామి తిరునాళ్ల

మార్టూరు: మండలంలోని బొబ్బేపల్లి, రాజుగారిపాలెం గ్రామాల మధ్యగల వీరాంజనేయ స్వామి ఆలయ 36వ తిరునాళ్ల ఈ నెల 16వ తేదీ ఆదివారం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా హనుమజ్జయంతి వేడుకల్లో భాగంగా ఎడ్ల ప్రదర్శన, కోలాటాలు, పాట కచేరీలు, విద్యుత్ ప్రభల ఏర్పాటు చేస్తున్నామని, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా నిర్వాహకులు కోరారు.

ఆరోగ్య స్థితిగతులను నమోదు చేయాలి

చీరాల టౌన్: గ్రామాల్లో ప్రజలతో పాటు చిన్నారుల ఆరోగ్య స్థితిగతులను విధిగా రికార్డుల్లో నమోదు చేయాలని పీహెచ్‌సీ వైద్యురాలు శ్రీదేవి సూచించారు. శుక్రవారం ఈపురుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్‌ఎంలు, ఆరోగ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం చిన్నారుల ఆరోగ్యం, శిశు మరణాల తగ్గింపుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిందన్నారు. 5 ఏళ్ల లోపు చిన్నారులకు అందించాల్సిన రోగాల నిర్మూలన టీకాలు, రోగ నిరోధకశక్తి పెంచే టీకాలను క్రమం తప్పకుండా అందించాలని సూచించారు. దీర్ఘకాలిక వ్యాధులు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారి వివరాలను వారం రోజుల్లో అందించాలని సూచించారు. సమావేశంలో ఆరోగ్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

14న జిల్లా చేనేతల ఆత్మీయ సమావేశం



మున్సిపల్ చైర్మన్‌ను కలిసిన చేనేత ఐక్యవేదిక ప్రతినిధులు

చీరాల: చీరాల మండలం ఈపురుపాలెంలో ఈనెల 14న బాపట్ల జిల్లా చేనేతల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు జాతీయ చేనేత ఐక్య వేదిక ప్రతినిధులు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరుతూ మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావును కలిశారు. పట్టణంలోని ఒకటి, నాలుగు, ఐదు, ఆరు, 10 వార్డుల్లో చేనేత వృత్తిపై జీవించే నేత కార్మికులను కలిసి కార్యక్రమానికి హాజరు కావాలని వారు కోరారు. కార్యక్రమంలో జాతీయ చేనేత ఐక్య వేదిక ప్రతినిధులు అండగుండ నారాయణ, మునగాల గిరిధర్, జి.వెంకయ్య, వంగర రామలింగయ్య, త్రిమూర్తులు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని



అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, ఉత్తరాయణం వైశాఖ మాసం, ధనిష్ట నక్షత్రం, అష్టమి తిథి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర శుక్రవారం తెలిపారు. క్షేత్ర ప్రాధాన్యం ఉన్న శనివారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకుపూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఉదయం ఐదు గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

సంక్షేమ పథకాలు పక్కాగా అమలు



లబ్ధిదారుడికి బుక్‌లెట్ అందిస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య



చంటిబిడ్డను ఆప్యాయంగా ఎత్తుకున్న కృష్ణచైతన్య

- ఏపీ శాప్‌నెట్ ఛైర్మన్ బాచిన కృష్ణచైతన్య

జే.పంగులూరు: రాష్ట్రంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను పక్కాగా అమలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందని ఏపీ శాప్ నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ బాచిన కృష్ణచైతన్య పేర్కొన్నారు. మండల పరిధిలోని జాగర్లమూడివారి పాలెంలో 2వ రోజు శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కృష్ణచైతన్య ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు ఎలా అందుతున్నాయని ఆరా తీశారు. జగనన్న పాలన సంతృప్తికరంగా ఉందంటూ లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం జగన్ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. ప్రజా ప్రతినిధులు ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తే, జగనన్న మాత్రం ఇచ్చిన హామీలతో పాటు, ఇవ్వని హామీలను కూడా అమలు చేసి ప్రజాభిమానాన్ని చూరగొంటున్నారని కొనియాడారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజా ప్రతినిధులు ప్రతి ఇంటికి వెళ్లి స్థానికంగా పరిష్కారం కాని సమస్యలను తెలుసుకొని పరిష్కరించేలా వినూత్న కార్యక్రమానికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారని తెలిపారు. అలాగే ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలనే ఆలోచనతో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ తేళ్ల నాగమ్మ, మండల ఉపాధ్యక్షులు యర్రం శ్రీనివాసరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రాయిణి సుబ్బారావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు జాగర్లమూడి వెంకట్రావు, గ్రామ నాయకులు జాగర్లమూడి నాగేశ్వరావు, మహేష్, శ్రీనివాసరావు, కేసిన శ్రీనివాసరావు, కోఆప్షన్ సభ్యులు ఖాశీంఖాన్, రామారావు, అజీల్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ నివేశన స్థలం



లే అవుట్‌ను పరిశీలిస్తున్న కరణం వెంకటేష్

- నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్

వేటపాలెం: అర్హులైన ప్రతి పేదవాడికి నివేశన స్థలం ఇళ్లు మంజూరు చేస్తామని చీరాల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పేర్కొన్నారు. మండల పరిధిలోని దేశాయిపేటలో ఇటీవల 77 మంది లబ్ధిదారులకు మంజూరు చేసిన నివేశన పట్టాల లేఅవుట్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు తమకు కేటాయించిన స్థలాల్లో ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. కాలనీలో అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లేళ్ల శ్రీధర్, బండికళ్ల నరేష్, కర్ణ లక్ష్మరావు, కర్ణ కృష్ణమోహన్, బొడ్డు సుబ్బారావు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణలో నర్సుల సేవలు మరువలేనివి



పీహెచ్‌సీలో కేక్ కట్ చేస్తున్న వైద్యాధికారి, నర్సులు

చినగంజాం: ప్రజారోగ్య పరిరక్షణలో నర్సులు చేస్తున్న సేవలు అభినందనీయం అని చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి ఎస్ విజయ భాస్కర్ అన్నారు. శుక్రవారం ప్రపంచ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 'మా నర్సులే మా భవిష్యత్' నినాదంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలో నర్సులు దేవుని దూతలలా తమ సేవలందించి లక్షల మంది ప్రాణాలను కాపాడారని, వారి సేవలు మరచిపోలేనివన్నారు. తల్లి ఒక బిడ్డకు జన్మనిస్తే నర్సులమ్మలు ఆ బిడ్డల ఆరోగ్యాన్ని కాపాడి పునర్జన్మను ఇస్తుందని హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ హరిప్రసాద్ అన్నారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలోని నర్సులు ఒకరినొకరు తమ వృత్తిని గౌరవించుకుంటూ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ బేబి, ఎల్‌టీ శ్యాం, ఫార్మసిస్ట్ సుశీల, ఆరోగ్య కార్యకర్తలు, సబ్ సెంటర్ సీహెచ్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న కేసులు పూర్తిచేయాలి



డీఎస్పీని కలిసిన బీసీ కమిషన్ మెంబర్ ముసలయ్య



డీఎస్పీని కలసి శాలువాతో సత్కరిస్తున్న జిల్లా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు

చీరాల రూరల్: పెండింగ్‌లో ఎస్సీ, ఎస్టీ కేసులను త్వరగా పూర్తిచేయాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కట్టా శ్రీనివాసరావు, తుపాకుల సురేష్‌బాబు, గల్లా నాగమల్లిలు శుక్రవారం కొత్తపేటలోని కార్యాలంలో డీఎస్పీ ఎస్. ప్రసాదరావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు డీఎస్పీకి పూలబొకే అందజేసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మానిటరింగ్ కమిటీ సభ్యులు పలు అంశాలను డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లలో పెండింగులో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణను త్వరగా పూర్తి చేయించి బాధితులకు సకాలంలో న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా డీఎస్పీ హామీ ఇచ్చినట్లు మానిటరింగ్ కమిటీ సభ్యులు తెలిపారు. వారివెంట దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధక్షుడు చప్పిడి వెంగళరావు ఉన్నారు. నూతనంగా చీరాల డీఎస్పీగా పదవి బాధ్యతలు చేపట్టిన ఎస్. ప్రసాదరావును ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మున్నంగి నాజరాజు, ఇతర నేతలు కలిసి పూలబొకేలు అందజేసి అభినందనలు తెలిపారు. డీఎస్పీని కలిసిన వారిలో బాపట్ల మహాజన సోషలిస్టు పార్టీ కన్వీనర్ బుడంగుంట్ల లక్ష్మీనరసయ్య, మాదిగ ఉద్యోగుల చీరాల సమాఖ్య నియోజకవర్గ అధ్యక్షుడు వంగివరపు రమేష్, తేళ్ల రవిప్రసాద్, తేళ్ల చైతన్య, దుడ్డు ప్రసాద్, సాయి తదితరులు ఉన్నారు.

డీఎస్పీని కలిసిన బీసీ కమిషన్ మెంబర్

చీరాల: చీరాల సబ్ డివిజన్ నూతన డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఎస్.ప్రసాదరావును శుక్రవారం బీసీ కమిషన్ మెంబర్ అవ్వారు ముసలయ్య స్వయంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు.

ఖరీఫ్ పంటల సాగుకు ప్రణాళిక సిద్ధం చేయాలి



మాట్లాడుతున్న చైర్మన్ శ్రీనివాసరావు

వేటపాలెం: రాబోయే 2023 ఏడాది ఖరీఫ్ పంటల సాగుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ పల్లపోలు శ్రీనివాసరావు సూచించారు. మండల పరిధిలోని రామన్నపేట రైతుభరోసా కేంద్రంలో మండల వ్యవసాయ సలహా కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ వేసవిలో పంట కాల్వల్లో పూడిక తీత పనులు, కాలవలపై కల్వర్టుల నిర్మాణాలు, చేపట్టాలన్నారు. ప్రతి రైతుకు రైతు భరోసా అందే విధంగా సిబ్బంది చూడాలన్నారు. ఎరువులు, పురుగు మందులు సిద్ధం చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఏఓ ఐ కాశీవిశ్వనాథ్ మాట్లాడుతూ రైతు భరోసాకు సంబంధించిన లబ్ధిదారుల జాబితాలు గ్రామాల పరిధిలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని చెప్పారు. త్వరలో రైతు భరోసా నిధులు వారి బ్యాంకు ఖాల్లో జమవుతాయిని తెలిపారు. మండల కమిటీ సమావేశంలో చర్చించిన అంశాలను జిల్లా స్థాయి కమిటీ దృష్టికి తీసుకెళ్లాలని తీర్మానించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు జంగిలి రామారావు, పశువైద్యాధికారి భాగ్యశ్రీ, ఐటీసీ గ్రామ సిరి ప్రాజెక్ట్ మేనేజర్ ఆర్ శ్రీనివాసశాస్త్రి సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలతో రైతులకు మేలు



కేవీ పాలెంలో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పేరయ్య



ముక్తేశ్వరంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్ రంగారావు

బల్లికురవ: ప్రభుత్వం రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని బాపట్ల జిల్లా రైతు అధ్యక్షుడు చింతల పేరయ్య, బల్లికురవ సొసైటీ అధ్యక్షుడు గుర్రం రంగారావు కోరారు. శుక్రవారం మండలంలోని కొమ్మినేనివారిపాలెంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పేరయ్య, ముక్తేశ్వరం గ్రామంలో రంగారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి ఎస్ వీపీ కుమారి మాట్లాడుతూ రైతులు ఆర్‌బీకేల్లో పంట ఉత్పత్తులను అమ్ముకునేందుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వారి ఉత్పత్తులను మాత్రమే కొనుగోలు కేంద్రంలో కొనుగోలు చేస్తారని చెప్పారు. క్వింటాలు ఒక్కింటికి ప్రభుత్వం రూ.1962 మద్దతు ధర ప్రకటించిందని, దళారులకు విక్రయించి నష్టపోవద్దని చెప్పారు. నాణ్యత ప్రమాణాలు పాటించి తేమ శాతం 14 శాతం కంటే తక్కువగా ఉండాలని రైతులకు చెప్పారు. కార్యక్రమంలో కేవీ పాలెం సొసైటీ అధ్యక్షుడు దర్శిరామకృష్ణారావు, స్థానిక నేతలు చింతల శ్రీనివాసరావు, మసిముక్కల వెంకటేశ్వర్లు, శివారెడ్డి సుబ్బారావు, పెద్దారావు పాల్గొన్నారు.

ఇంటింటికీ తిరిగి విద్యార్థులకు పాఠాలు



ఇంటి దగ్గర విద్యార్థులకు సూచనలిస్తున్న ఉపాధ్యాయుడు నాగమల్లేశ్వరరావు

చినగంజాం: మండలంలోని మున్నంవారిపాలెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సిద్ధం నాగమల్లేశ్వరరావు తన పాఠశాల పరిధిలోని విద్యార్థుల ఇంటింటికి తిరిగి పాఠాలు బోధిస్తూ తోటి ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రభుత్వం విద్యార్థులలో పఠనాసక్తిని, సృజనాత్మకతను పెంపొందించే ఉద్దేశంతో చేపట్టిన 'చదవడం మాకిష్టం' సెలవుల్లో సరదాగా సమ్మర్ క్యాంపు కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికి తిరిగి బోధనా కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థులకు గ్రంథాలయ పుస్తకాలు ఇచ్చి, వారికి వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేశాడు. వాటి ద్వారా వారిలో సామర్థ్యాలను ఎంతవరకు పెంచాలో తెలుసుకుంటూ ఇళ్లకు వెళ్లి నోట్ పుస్తకాలలో తప్పొప్పులను సరిచేసి నైపుణ్యాలను వెలికి తీస్తున్నాడు. ఈసందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయుడు నాగమల్లేశ్వరరావును అభినందిస్తున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన హరికృష్ణ

మార్టూరు: జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగిన రెండు ప్రమాదాల్లో ముగ్గురు గాయపడ్డారు. 108 సిబ్బంది నాగేశ్వరమ్మ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. అద్దంకికి చెందిన శ్రీనివాస్, వై. శ్రీనివాసరావులు ఇద్దరు పత్తిపాడులో ఓ వివాహానికి హాజరై బైకుపై తిరిగి అద్దంకి వెళ్తున్నారు. జొన్నతాళి సమీపంలో నిద్రమత్తులో వీరి వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో రోడ్డుపై పడి ఇద్దరు గాయపడ్డారు. వీరిని 108 సిబ్బంది స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సర్వీసు రోడ్డులో..

కోనంకి గ్రామానికి చెందిన జీ హరికృష్ణ చిలకలూరిపేట నుంచి బైక్‌పై కోనంకి వెళ్తూ మార్టూరులో సర్వీసు రోడ్డులో పెట్రోలు బంకు ఎదురు బైకును కారు ఢీకొట్టడంతో రోడ్డుపై గాయపడ్డాడు. 108 సిబ్బంది హరికృష్ణను ప్రథమ చికిత్స అనంతరం చిలకలూరిపేటలో ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

అర్జీల విచారణలో అలసత్వం తగదు

చీరాల టౌన్: ప్రజలు, విద్యార్థులతో పాటుగా వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం వచ్చిన అర్జీలను జాగ్రత్తగా విచారణ చేయాలని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రెవెన్యూ గ్రామాల వారీగా పెండింగ్‌లో ఉన్న అర్జీలను త్వరగా విచారణలు చేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం అందించే రెవెన్యూ సేవలను అందరికి అందించాలన్నారు. సమావేశంలో డీటీ సురేష్, ఆర్ఐ శేఖర్, సర్వేయర్ లోకేష్, వీఆర్వోలు తదితరులు ఉన్నారు.

రోటరీ క్లబ్ ఆఫ్ ఆధ్వర్యంలో రక్తదానం



కోనంకిలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

మార్టూరు: మార్టూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కోనంకి గ్రామంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఉప్పలపాటి వాసుదేవరావు వర్ధంతి సందర్భంగా మాజీ డైరీ చైర్మన్ ఉప్పలపాటి చంగలయ్య సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 27 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు గుంటుపల్లి శివకృష్ణ రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కొర్రపాటి ఖాజారావు,కుర్రా వెంకటరామయ్య, ఇతర రోటరీ ప్రతినిధులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బల్లికురవలో కోలాహలంగా కొలుపులు



బొల్లావులను ఆడిస్తున్న గ్రామస్తులు

బల్లికురవ: బల్లికురవలో గ్రామ దేవత పోలేరమ్మ కొలుపులు వారం రోజులుగా కోలాహలంగా జరుగుతున్నాయి. గత శుక్రవారం కొలుపులకు అంకురార్పణ చేశారు. ఇంటింటి చద్ది సేకరణతో అమ్మవారికి ప్రతి రోజూ నివేదన చేస్తున్నారు. రాత్రి సమయాల్లో డప్పు వాయిద్యాలు నృత్యాలతో, బొల్లావులు, వీరతాళ్లతో గ్రామోత్సవం నిర్వహిస్తున్నారు. ఆదివారంతో కొలుపుల కార్యక్రమం ముగియనున్నాయి. వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లిన వారు కొలుపుల కార్యక్రమానికి రావడంతో బంధుమిత్రుల రాకతో ప్రతి ఇంట్లో పండుగ వాతావరణం నెలకొంది.

వేసవి శిబిరాలతో విజ్ఞానం

అద్దంకి: విజ్ఞాన శిబిరాలతో బోలెడంత విజ్ఞానం సంపాదించవచ్చని సంతమాగులూరు లైబ్రేరియన్ బీ విజయభాస్కరరెడ్డి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా వేసవి శిబిరాలతో విజ్ఞానం ఐదో రోజు విద్యార్థులకు కథలు చెప్పడం, చదివించడం, రైమ్స్ వంటి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ ప్రతి రోజూ గ్రంథాలయాన్ని ప్రతి విద్యార్థి ఏదో సమయంలో సందర్శించి ఒక మంచి పుస్తకాన్ని తీసుకెళ్లి చదవాలన్నారు. అదే విధంగా తరగతి పుస్తకాలు, విజ్ఞాన పుస్తకాలు, వినోదం, మాస, వార, దిన పత్రికలను చదవడంతో ఎన్నో విషయాలు తెలుస్తాయని చెప్పారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వేటపాలెం: మండలం పరిధిలోని రామన్నపేట పంచాయతీ రావూరిపేట 11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్లు ఏఈ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామన్నపేట ఏరియాలోని రావూరిపేట సర్వోదయ కాలనీ, సమైఖ్య నగర్, నాయినపల్లి ఏరియాల్లో ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

కారంచేడు: మండల కేంద్రం కారంచేడు సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ కే పిచ్చియ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని స్వర్ణ, కారంచేడు సబ్‌స్టేషన్ల పరిధిలోని కారంచేడు, కుంకలమర్రు, స్వర్ణ, దగ్గుబాడు, కొడవలివారిపాలెం, కేశవరప్పాడు, స్వర్ణ గ్రామాలతో పాటు, మిగిలిన అన్ని గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహం 1.00 గంట వరకు సరఫరా నిలిపివేసి, మరమ్మతులు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

నేడు రామలింగేశ్వరస్వామి వార్షిక తిరునాళ్ల

బల్లికురవ: మండలంలోని కొణిదెన గ్రామంలో వేంచేసియున్న రామలింగేశ్వర స్వామి 14వ వార్షిక తిరుణాళ్ల శనివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపారు. ఉదయం 5 గంటలకే శివుడికి మహన్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజలు, కల్యాణోత్సవం, ప్రత్యేక అలంకరణ, 10 గంటల నుంచి అన్నదానం నిర్వహించనున్నట్లు చెప్పారు. దీనిలో భాగంగా రెండు పళ్ల విభాగంలో బండలాగుడు పోటీలు శుక్రవారం రాత్రి నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. వైఎస్సార్ సీపీ, టీడీపీ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మూడు భారీ ఎలక్ట్రిక్ ప్రభలు, వాటిపై సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.